14-4-50

# ఫిలిం విచారణ సంఘ కార్యకలాపం

భారత ప్రభుత్వం ఏర్పరచిన చలన చిత్ర పరిశ్రమ విచారణ సంఘం ఫిబ్రవరి మొదటి వారంలో బొంబాయిలోను, మార్చి ఆఖరు వారంలో మద్రాసులోను సమావేశమై ప్రొడ్యూసర్లను, డిస్ట్రిబ్యూటర్లను, ఎగ్జిబిటర్లను, టెక్నీషియన్లను కలుసుకుని వారి కష్ట నిష్ఠూరాలను జాలా సావధానచిత్తంతో విన్నారు. ఈ విచారణ సంఘ సభ్యులకు ఘనమైన స్వాగతాలు యివ్వడం, సన్మాన పత్రాలు సమర్పించుకోవడం జరిగింది. ఈ రోజుల్లో కాంగ్రెసు ప్రభుత్వపు మంత్రులకు ఎటువంటి మర్యాదలు జరుగుతున్నాయో అటువంటి మర్యాదలే వారు ఏర్పరచిన కమిటీల సభ్యులకుగూడా జరుగుతున్నాయి. ఫలితంగా వారు ఏయే విషయాలయితే సేకరించ దలచుకున్నారో, ఏ పరిశ్రమ సాధక బాధకాలను విచారించి సహాయం చెయ్య దలచుకున్నారో అది పూర్తిగా చెయ్యలేక పోతున్నారు.

భారత ప్రభుత్వం ఏర్పరచిన విచారణ సంఘం ఫిలిం పారిశ్రామికులను విచారించి, శిక్షించటానికే నిర్దేశింపబడిందనే తప్పు అభిప్రాయం అనేక ఫిలిం పారిశ్రామికుల హృదయాల్లో పాదుకొంది. అందుకనే యీ విచారణ సంఘం తయారుచేసిన ప్రశ్నావళి విద్యార్థులకిచ్చే పరీక్షా పత్రంలాగ వుందనే విమర్శగూడా వచ్చింది. ఇటువంటి అనవసర భయాలు, అపనమ్మకాలు చిత్రనిర్మాణం వివిధ శాఖల్లో పనిచేసేవారి అవిద్యవల్ల, మూర్ఖతవల్ల ఏర్పడుతున్నాయంటే సందేహం లేదు.

ఫిలిం విచారణ సంఘం ఫిలిం పరిశ్రమలోని లోటుపాట్లు గమనించి పారిశ్రామికులను శిక్షిస్తుందనే అభిప్రాయం ఎప్పుడైతే కలిగిందో, అప్పుడు యీ పరిశ్రమలోని కష్టాలను, నష్టాలను వివరించటానికి ఎవరూ ముందుకు రారుగదా, విచారణ సంఘం తెలుసుకోవటానికి అవకాశం గూడా యివ్వరు. ఫలితంగా ప్రభుత్వం ఆశయం మంచిదయినా పని శూన్యం.

విచారణ సంఘ సభ్యులు పారిశ్రామికుల్లోని యీ భయాన్ని, యీ దురభిప్రాయాన్ని పోగొట్టడానికే పదేపదే తమ కర్తవ్యాన్ని భారత ప్రభుత్వం సదుద్దేశాన్ని వెలిబుచ్చుతున్నారు. కాని యీ వెలిబుచ్చటాన్ని వారు వేదికల మీదనుంచి చేసినా, పత్రికా విలేఖరుల ద్వారా చేసినా గూడా లాభం లేదు. విచారణ సంఘ సభ్యులు తాము ప్రభుత్వం చేత నియమితులమైనాము గదా అని అందలం ఎక్కికూర్చుంటే లాభంలేదు. చిత్ర పరిశ్రమలోని వివిధ శాఖల సభ్యులతోను సన్నిహితత్వం సంపాదించుకొని, చేతులు జోడించి విషయ సేకరణ జరపాలి.

నేటి సినిమా పారిశ్రామికుల్లో మరొక విధమైన భయం గూడవుంది. అదేమిటంటే భారత ప్రభుత్వం యీ పరిశ్రమను అభివృద్ధిచేసి, జాతీయం చేస్తుందేమోననే భయం. ఇది పారిశ్రామికదృష్ట్యా చాలా సహజమైన భయం. అందువల్లనే పారిశ్రామికులు నేటి సినిమా పరిశ్రమ ఎంతో అధోగతిలో వున్నట్లు కట్లాడుతున్నారు. ఒక విధంగా ఆలోచిస్తే సినిమా పరిశ్రమద్వారా అధిక లాభాలను పొందేవారికి యీ విచారణ సంఘం, దీని కార్యక్రమం కిట్టదు. వీరు లేనివి వున్నట్లుగా నిరూపించి, ప్రభుత్వాన్నే తప్పుదారి తొక్కించి పరిశ్రమను మరికొన్నాళ్లు తమ అదుపాజ్ఞలలో పెట్టుకోవాలని చూస్తారు. ఈ పరిస్థితిలో సినిమా పరిశ్రమను జాతీయం చెయ్యడం మాట ఎలాగవున్నా ప్రభుత్వం పరిశ్రమకు చెయ్యదలచుకున్న సహాయం పీసమెత్తు గూడా జరుగదు.

గతమాసం ఫిలిం విచారణ సంఘసభ్యులు మద్రాసు వచ్చినపుడు, విచారణ సంఘాధ్యక్షుడు పత్రికా విలేఖరుల గోష్ఠిలో మాట్లాడుతూ భారత ప్రభుత్వం సినిమా పరిశ్రమను యిప్పుడప్పుడే జాతీయం చెయ్యదనీ, ముందుగా పరిశ్రమ స్థితి బాగు పడాలనీ అన్నాడు. అంటే పరిశ్రమను బాగుచేసి జాతీయం చేస్తారేమోననే భయం పారిశ్రామికులకు వెంటనే కలుగు



14-4-50

14-4-50

తుంది. ఒకపక్కనుంచి బెదిరిస్తూ, భయపెడుతూ, మరొక పక్కనుంచి మిమ్మల్ని, మీ పరిస్థితిని బాగుచేస్తాం అంటే ఎవరు నమ్ముతారు? కాబట్టి ఫిలిం విచారణ సంఘం అన్నిటికంటె ముందుగా పారిశ్రామికులను నమ్మించాలి. వారి మంచిని సంపాదించుకోవాలి. పారిశ్రామికుల సహృదయతను సంపాదిస్తేగాని విచారణ సంఘం చెప్పుకోతగ్గ సహాయం సినిమా పరిశ్రమకు చెయ్యలేదు.

ప్రభుత్వం విచారణ సంఘం ద్వారా ఏమీ చెయ్యలేక పోతే నిజంగా బాధపడేవారు పరిశ్రమలోని సామాన్య జీతగాడు, యీనాటి ప్రేక్షకుడు. నిర్మాతలు గాని నటీనటులుగాని వాళ్ళ సొమ్మును అధికలాభాలను రాబట్టుకోగలరు. విచారణ సంఘం, వారి రక్షణకొరకు పూనుకోనక్కరలేదు. హెచ్చువడ్డీలకు నిర్మాతలు సొమ్ము అప్పుగా తెస్తే చిత్రనిర్మాణానికి ఖర్చు ఎక్కువవుతుంది. అది నిర్మాత ఫిలిం డిస్ట్రిబ్యూటర్ల వద్దనుంచి వసూలు చేస్తాడు. డిస్ట్రిబ్యూటరు ఎగ్జిబిటరు దగ్గరనుంచి వసూలు చేస్తాడు. ఎగ్జిబిటరు ప్రేక్షకుల దగ్గరనుంచి వసూలు చేస్తాడు. మొత్తం దెబ్బతినేవాడు ప్రేక్షకుడే. నిర్మాతలు అధిక లాభాలు పొందినా స్టూడియోలో పనిచేసే సామాన్య జీతగాడి జీతం అంతే.

విచారణ సంఘం పట్టుదలతో ప్రయత్నించి నేటి నిర్మాణవ్యయాన్ని తగ్గించటానికిగాని, ఇక పెరగకుండా వుంచటానికిగాని పాటుపడాలి. తక్కువ వడ్డీరేటుతో చిత్రనిర్మాతలకు సొమ్ము అప్పుగా దొరికేటట్టు చూడాలి. లేక నిర్మాతలంతా కలిసి ప్రభుత్వ సహాయంతో సొమ్ము పెట్టుబడి పెట్టే సంస్థను లేవదీయటం మంచిది. నేటి సినిమా పరిశ్రమ ఆర్థిక స్థితి బాగుపడితే యికమిగిలిన విషయాలన్నీ స్వల్పశ్రమతో పరిష్కరించవచ్చును. ఫిల్ముల నిడివి కేంద్రసెన్సారు వంటి విషయాలు విచారణసంఘంగాని, ప్రభుత్వంగాని తొందరపడక, డబ్బు, పలుకుబడివున్న నిర్మాతలమాటలే వేదవాక్యంగా తీసుకోక, నిదానంగా ఆలోచించి పరిశ్రమకు, కళకు, ప్రేక్షకులకు హానిలేని పద్ధతిలో తీర్మానించడం మంచిది.

విచారణసంఘం యీ సంవత్సరాంతంలోగా తన నివేదికను ప్రభుత్వానికి అందచేస్తానంటోంది. ఈ సంఘం యీలోగా సమగ్రమైన పరిశీలన జరిపి పలుకుబడి, డబ్బువున్న నిర్మాతల అవసరాలకే ఎక్కువ ప్రాముఖ్యం యివ్వకుండా, చిన్న నిర్మాతలను, వారి అవసరాలను దృష్టిలో పెట్టుకొని మొత్తంమీద పరిశ్రమ అభివృద్ధికి అన్నివిధాలా తోడ్పడుతుందని ఆశించుదాం.

* * *

## 'సినిమాల్లో రాజకీయాలు' ప్రతి విమర్శ

'సినిమాల్లో రాజకీయాలు' అనే శీర్షికతో నేను వ్రాసిన వ్యాసంమీద కృష్ణమూర్తి గారి అభిప్రాయంతో వ్రాయబడిన వ్యాసం చదివాను. ఆయన వ్రాయ దలచుకున్నదంతా వ్రాసి తీర్పు చెప్పటానికి సహృదయులకు వదిలేశారు. దీన్నిబట్టి తీర్పుచెప్పే సాహసంగాని, సహృదయతగాని కృష్ణమూర్తిగారి దగ్గర లేవు అనేమాట స్పష్టం. ఆయన తీర్పుగురించి ఆయనకే సందేహం మరొక విశేషం.

ఇక వారు వెలువరించిన అభిప్రాయాలు పరిశీలించుదాం. నేను యీరోజుల్లో ఏచిత్రానికైనా డబ్బు వస్తుందని వ్రాశాను. అంతేగాని ఎక్కువ తక్కువలు రాయలేదు. కీలుగుఱ్ఱం వంటి జానపద చిత్రాలకు వచ్చినసొమ్ము మన దేశంవంటి చిత్రాలకు రాకపోవచ్చును. కాని మనదేశం చిత్రానికైనా పెట్టుబడిమీద స్వల్ప లాభాలు వస్తాయిగాని, ఆశించినంత అధిక లాభాలు రావు. నిర్మాతలు రాజకీయ చిత్రాలు తీసి దుమ్ము కొట్టుకుపోవాలనిగాదు నా అభిప్రాయం. సినిమా పరిశ్రమ ఒక వ్యాపారం. వ్యాపారస్థు డెప్పుడూ ఆశయాల కోసం మొదటికే మోసం తెచ్చుకోడు. కాకపోతే అధిక లాభాలల్లా స్వల్ప లాభాలు అవుతాయి. ఈనాడు రాజకీయ చిత్రాలు తీసే నిర్మాతలు అంతమాత్రం త్యాగమే చెయ్యవలసివుంటుందని నా అభిప్రాయం. బాక్సాఫీసు డబ్బు అందరూ ఆశిస్తారు.



14-4-50